సాక్షి
నిర్మల్
బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



ఓవర్ టు మర్రిచెట్టు
నాగోబా జాతరలో భాగంగా పవిత్ర గంగాజలంతో మెస్రం వంశీయులు మర్రిచెట్టు కింద కితలవారీగా బస చేసి విశ్రాంతి తీసుకున్నారు. ప్రధాన్ సమాజ్ పెద్ద నాగోబా చరిత్ర వివరించారు. 8లో ▸



అసంపూర్తి రోడ్లతో అవస్థలు
కుభీర్ మండలంలో చేపట్టి వివిధ రోడ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 9లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
34.0 /21.0
ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఖమ్మం జిల్లాలోని ప్రజాపంథా నాయకులపై అక్కడి సీపీ సునీల్‌దత్ పెట్టిన కేసులు ఎత్తివేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా, మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కట్ల రాజన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో ప్రజాపంథా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నపాటి గొడవను సాకుగా చూపి సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ నాయకుడు, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల అశోక్, మాజీ కార్యదర్శి సీవై పుల్లయ్య, ప్రజాసంఘాల నేతలు తిమ్మిడి హనుమంతారావు, అశోక్, గడ్డం లక్ష్మణ్, శ్రీనును రౌడీషీటర్లు అంటూ సీపీ అనడం సరికాదని తెలిపారు. ఈ వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకుని అరెస్ట్ చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిస్తామన్నారు. ఆయన వెంట పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కే లక్ష్మి, ఎస్.గంగన్న, వీ మహేందర్, పార్టీ నాయకులు ఎస్.లక్ష్మి, గఫూర్, పోశెట్టి, రాజారాం పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై డీజీపీ సమీక్ష



వీసీలో ఎస్పీ జానకిషర్మిల, ఏఎస్పీ కాంతిలాల్

నిర్మల్‌టౌన్: డీజీపీ రవి గుప్తా మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల గురించి పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీసీలో ఎస్పీ జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: బీసీ సంక్షేమ శాఖ, బీసీ స్టడీ సెంటర్ నిర్మల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్స్ పరీక్షల ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి వీ రాజేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులై జిల్లాకు చెందిన బీసీ నిరుద్యోగులు అడ్మిషన్ కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9705052825, 9440248316 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కోర్టు భవనాలు నిర్మించాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా నూతన కోర్టుల భవన నిర్మాణాలు ప్రస్తుత కోర్టు సముదాయాల స్థలంలోనే నిర్మించాలని మంగళవారం సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వ న్యాయ వ్యవహారాలు, న్యాయ శాఖ విభాగ ప్రభుత్వ కార్యదర్శి రేండ్ల తిరుపతిని న్యాయవాది అల్లూరి మల్లారెడ్డి కోరారు. త్వరగా పూర్తి స్థాయి భవన సముదాయాన్ని పూర్తి చేయాలని, ఇందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి సహకరించాలని జిల్లా న్యాయవాదుల తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. స్పందించిన తిరుపతి ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి ప్రతిపాదన తీసుకువెళ్తానని హామీ ఇచ్చినట్లు ఈ సందర్భంగా మల్లారెడ్డి పేర్కొన్నారు.

'కేసీఆర్ తెలంగాణ ద్రోహి'

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణలో నిండుకుండలా ఉండే ప్రాజెక్టులను ఆంధ్రకు తాకట్టుపెట్టిన తెలంగాణ ద్రోహి మాజీ సీఎం కేసీఆర్ అని టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ ఎంబడి రాజేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి పేరిట గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ఓర్వలేకే అనవసర ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

విపత్తుల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లీలోగల పాత మున్సిపల్ భవనంలో ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పించారు. వరదలు, భూకంపాలు, రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు స్పందించాల్సిన తీరుపై వివరించారు. గుండెపోటు వస్తే చేయాల్సిన సీపీఆర్ విధానం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సీఐ రాజారెడ్డి, ఎన్డీఆర్ఎఫ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ పింటు నంది, బృందం సభ్యులు తదితరులున్నారు.

ఇంకెంత కాలం?



నిర్మల్ జిల్లాకేంద్రంలో ధర్నా చేస్తున్న అభ్యర్థులు

- టీచర్ ఉద్యోగాల కోసం ఎదురుచూపు
- పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్
- తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని వినతి
- నేడు విద్యాశాఖ ఆఫీస్ ముట్టడికి పిలుపు
- హైదరాబాద్‌కు తరలివెళ్లిన అభ్యర్థులు

నిర్మల్ ఖిల్లా: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2017లో ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ డీఎస్సీ నిర్వహించలేదు. అప్పుడు 8,792 ఖాళీలతో నోటిఫికేషన్ విడుదల చేసి ఎంపికైన అభ్యర్థులకు 2019లో నియామకాలు కల్పించింది. అప్పటినుంచి ఏడేళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాల కోసం నిరీక్షించారు. రెండు నెలలుగా డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతూ విజ్ఞప్తులు చేశారు. ధర్నాలు, రాస్తారోకోలతో డిమాండ్ వినిపించారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈనెల 7న హైదరాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయం ముట్టడికి 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ ఎక్కువ ఖాళీలతో విడుదల చేయాలని కోరుతున్నారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలవారీగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య తక్కువ ఉందని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు.

ఖాళీలు పెంచాలంటున్న అభ్యర్థులు

ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులు గతంలో వెలువరించిన నోటిఫికేషన్‌కు మరిన్ని పోస్టులు కలిపి అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు. ఈ నోటిఫికేషన్‌లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, పండిట్ తదితర టీచర్ల ఖాళీలను గతంలో ఉన్న వాటి కంటే పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఖాళీల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతున్నారు. ఇదే అంశంపై జిల్లాకు చెందిన డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం నాయకులు జిల్లావిద్యాశాఖాధికారి కార్యాలయంలో పలుసార్లు వినతిపత్రం అందజేశారు. అయితే ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్లకు పీజీహెచ్‌ఎంలుగా ప్రమోషన్లు ఇవ్వడంతో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కూడా ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంటున్నారు. అయితే ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందే క్రమంలోనే కోర్టు కేసుల వివాదంతో ప్రక్రియ నిలిచింది. అయితే టెట్ అర్హత ఉన్నవారికి స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లకు అర్హులని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించడంతో ఈ ప్రక్రియకు అడ్డంకిగా మారింది. ఈ అవాంతరాలను అధిగమించి డీఎస్సీ నోటిఫికేషన్ సత్వరమే జారీ చేయాలని, ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతం చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ప్రమోషన్లు చేపడితే మరిన్ని ఖాళీలు

ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చి అవకాశం కల్పిస్తే క్షేత్రస్థాయిలోని ఎస్జీటీ పోస్టుల్లో ఖాళీలు మరిన్ని ఏర్పడే అవకాశాలున్నాయి. నిర్మల్ జిల్లాలో గతంలో ఉపాధ్యాయ ఖాళీలు 461 ఉండగా ప్రమోషన్లు చేపడితే మరిన్ని ఖాళీలు పెరిగే అవకాశాలున్నట్లు నిరుద్యోగ అభ్యర్థులు పేర్కొంటున్నారు. కోర్టు చిక్కులను పరిష్కరించి ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గత నోటిఫికేషన్ ఖాళీలు ఇలా...

జిల్లా	ఎస్ఏ	ఎస్జీటీ	ఎల్‌పీ	పీఈటీలు	మొత్తం
ఆదిలాబాద్	54	206	13	02	275
కుమురంభీం	49	214	24	02	289
మంచిర్యాల	36	58	16	03	113
నిర్మల్	16	91	04	04	115

నేడు 'చలో హైదరాబాద్'

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలోని డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం ప్రతినిధులు 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయాన్ని బుధవారం ముట్టడించునున్నట్లు పేర్కొంటున్నారు. మంగళవారం రాత్రి అభ్యర్థులు రాష్ట్ర రాజధానికి బయలుదేరివెళ్లారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు ముందే రాష్ట్రవ్యాప్తంగా 20వేల ఉపాధ్యాయ ఉద్యోగాలకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతున్నారు. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ప్రక్రియ కూడా సత్వరమే పూర్తి చేసి ఏర్పడిన ఖాళీలు ఇందులో కలపాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంత అభ్యర్థులమంతా పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారమని, ఉద్యోగాల కోసం సుదీర్ఘకాలంగా వేచి చూస్తున్నామని పేర్కొన్నారు. 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ వచ్చి విజయవంతం చేయాలని కోరుతున్నారు. డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం జిల్లా ప్రతినిధులు ఆనంద్‌బాబు, తిరుమలేశ్, సురేశ్ తదితరులున్నారు.

ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న



ఐదేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ కోసం ఆశగా ఎదురుచూస్తున్న. గత ఎన్నికల ముందు జారీ చేసిన నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య తక్కువగా ఉంది. దీనికి అనుబంధంగా నోటిఫికేషన్ జారీ చేసి పోస్టుల సంఖ్య పెంచాలి. అప్పుడే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది.
– బీ సురేశ్, నిర్మల్

నోటిఫికేషన్ విడుదల చేయాలి



రాష్ట్రంలో డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు వేల సంఖ్యలో ఉన్నారు. వారంతా ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి. అన్ని జిల్లాల అభ్యర్థులతో కలిసి బుధవారం హైదరాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.
– ఎల్.తిరుమలేశ్, ఖానాపూర్

ఎక్కువ ఖాళీలు ప్రకటించాలి



ఏడాదిగా ధర్నాలు, దీక్షలు, విజ్ఞప్తులు చేస్తున్నాం. గతంలో ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌కు అనుబంధ నోటిఫికేషన్‌లో ఎక్కువ మొత్తం ఖాళీలను కలిపి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలి. లేని పక్షంలో ఆయా జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం ఎదుట వరుస ధర్నాలు నిర్వహిస్తాం.
– శివకుమార్, నిర్మల్

'ఏలేటి'కి బీజేఎల్పీ చాన్స్?

- నలుగురు ఎమ్మెల్యేలనిచ్చిన ఉమ్మడి జిల్లాకు అవకాశం..!
- నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అసెంబ్లీలో అనుభవమున్న నేత
- ప్రస్తుతం ఢిల్లీలోనే ఎమ్మెల్యేలు



ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: శాసనసభలో బీజేపీ పక్షనేతగా ఉమ్మడిజిల్లాకు చెందిన ఎమ్మెల్యేకు అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఓసారి గెలిచి అనుభవమున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేరు ముందువరుసలో ఉంది. ఈనెల 8నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల నాటికి బీజేపీ శాసనసభాపక్ష (బీజేఎల్పీ) నేతను ఎన్నుకోనున్నట్లు పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న జిల్లాకు చెందిన బీజేపీ ఎమ్మెల్యేలు బీజేఎల్పీ విషయంలోనూ పార్టీ పెద్దలతో చర్చిస్తున్నట్లు చెబుతున్నాయి.

నలుగురు ఇక్కడే..

రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉన్న ప్రాంతమంటే ఉత్తర తెలంగాణే. అందులోనూ ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోనే అత్యధికంగా ప్రభావం చూపగలుగుతోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే విషయం స్పష్టమైంది. ఉమ్మడి నిజామాబాద్‌లో కామారెడ్డి (కాటిపల్లి వెంకటరమణారెడ్డి), నిజామాబాద్ అర్బన్ (ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త), ఆర్మూర్ (పైడి రాకేశ్‌రెడ్డి) బీజేపీ ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిర్మల్ (ఏలేటి మహేశ్వర్‌రెడ్డి), ముధోల్ (పవార్ రామారావుపటేల్), ఆదిలాబాద్ (పాయల్ శంకర్), సిర్పూర్ (పాల్వాయి హరీశ్‌బాబు) గెలుపొందారు. ఇక హైదరాబాద్‌లో గోషామహల్ నుంచి రాజాసింగ్ మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. మొత్తం ఎనిమిదిమంది బీజేపీ ఎమ్మెల్యేల్లో నలుగురు ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందినవారే ఉన్నారు. పార్టీకి ఎక్కువ ఓట్లతో పాటు సీట్లనూ ఇచ్చిన ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యతనిచ్చే క్రమంలో బీజేఎల్పీ ఇస్తారన్న వాదన ఉంది.



ఢిల్లీలోనే ఎమ్మెల్యేలు..

త్వరలో అసెంబ్లీ సమావేశాలు, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు వరుసగా ఉండటంతో బీజేపీ తెలంగాణపై ప్రధాన దృష్టిపెడుతోంది. ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఫోకస్ చేస్తోంది. ఈక్రమంలోనే ఈనెల 4న నిర్మల్‌లో ఆదిలాబాద్ పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో పార్లమెంట్ పరిధిలోనే ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. పార్టీ రాష్ట్రసంఘటన మంత్రి చంద్రశేఖర్ పాల్గొని లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. తాజాగా బీజేపీ ఎమ్మెల్యేలు ఢిల్లీ వెళ్లారు. అసెంబ్లీ సమావేశాలు, పార్లమెంట్ ఎన్నికలతోపాటు బీజేఎల్పీ నేత ఎంపిక కూడా అప్పుడే తేల్చనున్నట్లు పార్టీ వర్గాలు స్పష్టంచేస్తున్నాయి.

సీనియారిటీ ప్రకారం..

బీజేపీ ఎమ్మెల్యేల్లో రాజాసింగ్, మహేశ్వర్‌రెడ్డి మినహా మిగిలిన వారంతా మొదటిసారి గెలిచిన వారే. బీజేఎల్పీనేత ఎంపికలో మాత్రం ఏలేటి పేరు ముందున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎమ్మెల్యేగా చేసిన అనుభవంతో పాటు అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ఇటీవల అసెంబ్లీ తొలి సమావేశాల్లోనూ బీజేపీ తరఫున మహేశ్వర్‌రెడ్డి మాట్లాడిన తీరుపై పార్టీ సంతృప్తి వ్యక్తంచేసింది. గతంలో కాంగ్రెస్‌లో ఉన్నప్పుడూ ఆయన ఢిల్లీవరకు సంబంధాలు కలిగిఉన్నారు. ఏఐసీసీ స్థాయి పదవి దక్కించుకున్నారు. బీజేపీలోనూ అలాగే ఢిల్లీస్థాయిలో పరిచయాలు పెంచుకున్నారు. ఈక్రమంలోనే తన ఎన్నికల ప్రచారానికి ఏకంగా ప్రధాని మోదీ వచ్చారన్న ప్రచారమూ ఉంది. వీటన్నింటి నేపథ్యంలో ఏలేటికే బీజేపీ శాసనసభ పక్షనేతగా ఎక్కువ చాన్స్ ఉన్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి.

ఇళ్ల కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

భైంసాటౌన్: పట్టణ శివారులోని మహాగాం రోడ్డులో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద లబ్ధిదారులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు పలువురు మహిళలు అక్కడికి చేరుకుని ఇళ్లు శుభ్రం చేసుకున్నారు. ఇంట్లో నివాసముండేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. అధికారులు లక్కీడ్రా ద్వారా డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తూ జాబితా ప్రకటించారని, ఇప్పటివరకూ తమకు ఇళ్లు కేటాయించడం లేదని ఆరోపించారు. అద్దె ఇళ్లలో ఉంటూ అవస్థలు పడుతున్నామని తెలిపారు. త్వరగా ఇళ్లు కేటాయించాలని కోరారు. అయితే, రెవెన్యూ అధికారులను సంప్రదించాలని పోలీసులు వారికి సూచించడంతో కొద్దిసేపటికి వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి



గూగుల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిస్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: అధికారులు జాయింట్ తనిఖీ చేసి జిల్లాలోని చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో చెరువుల సంరక్షణ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెరువులు ఆక్రమణకు గురి కాకుండా ఉండేందుకు కమిటీలు ఏర్పాటు చేసి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. జలవనరులకు అధిక ప్రాధాన్యమిస్తూ వాటి పరిరక్షణకు కృషి చేయాలన్నారు. చెరువులను పరిశీలించి వాటి ఎఫ్‌టీఎల్, సర్వే నంబర్లను గుర్తించి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ కమిటీలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కందకాలు, రెవెన్యూ, సర్వే ల్యాండ్, మున్సిపల్ డిపార్ట్‌మెంట్లు కందకాలు సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. అనంతరం గూగుల్ మ్యాప్ ద్వారా జౌలినాలా, పట్టణ పరిసర ప్రాంతాల్లో ముంపునకు గురయ్యే కాలనీలు, వీధులు పరిశీలించారు. అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకళ్యాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై సీఎం వ్యాఖ్యలు సరికాదు



నర్సారెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఐకేరెడ్డి, నాయకులు

నిర్మల్‌టౌన్: ఇంద్రవెల్లిలో నిర్వహించిన తెలంగాణ పునర్నిర్మాణసభలో సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణకు పాల్పడడం సరికాదని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గిరిజనులకు అండగా నిలిచిన కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడ్డాక 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయకున్నా.. కేంద్రం నుంచి నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ప్రజలకిచ్చిన హామీని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి నిలబెట్టుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత నర్సారెడ్డి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. నర్సారెడ్డి అంత్యక్రియలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడాన్ని తప్పుపట్టారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఎంపీపీ రమేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రమణ, నాయకులు రాంకిషన్‌రెడ్డి, రాంచందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బదిలీపై ఆంతర్యమేమిటో!

భైంసాటౌన్: జిల్లాలో సీఎంఆర్ కోసం రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యం బదిలీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2022–23 ఖరీఫ్‌కు సంబంధించి సీఎంఆర్ గడువు గతనెల 31తో ముగియగా, గడువుకు కొద్ది రోజుల ముందే జిల్లాలోని కొన్ని రైస్‌మిల్లుల నుంచి ధాన్యాన్ని ఇతర మిల్లులకు కేటాయించారు. 2022–23 ఖరీఫ్‌నకు సంబంధించి గత నెలాఖరు వరకు 72 శాతం సీఎంఆర్ పూర్తయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. గడువు ముగియడంతో ఈనెలలో రైస్‌మిల్లుల నుంచి బియ్యం సేకరణ నిలిచినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామని పేర్కొంటున్నారు. కాగా, 2022–23 ఖరీఫ్ ధాన్యాన్ని జిల్లాలోని ఆరు రైస్‌మిల్లుల నుంచి సారంగపూర్, బాసర మండలాల్లోని మిల్లులకు బదిలీ చేశారు. జిల్లాలోని ఓ రైస్‌మిల్లు నుంచి దాదాపు 13 వందల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మరో మిల్లుకు బదిలీ చేశారు. తద్వారా సదరు మిల్లు బకాయి తక్కువగా చూపే ప్రయత్నం జరిగి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఇలా ఓ మిల్లు నుంచి మరో మిల్లుకు ధాన్యం బదిలీ చేయడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ఇన్‌చార్జి డీసీఎస్‌వో, డీఎం శ్రీకళను వివరణ కోరగా, సీఎంఆర్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేసేందుకు వీలుగా మిల్లర్లు కోరడంతో ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీకి అనుమతిచ్చినట్లు పేర్కొన్నారు.

ఖరీఫ్ సీఎంఆర్ ఇలా..

జిల్లాలో 2022–23 ఖరీఫ్ సీఎంఆర్ కోసం మిల్లులకు 1,68,177 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కేటాయించారు. ఇందుకు మిల్లర్లు 1,12,967.819 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని గత 31వ తేదీవరకు అప్పగించాల్సి ఉండగా 81,428.031 మెట్రిక్ టన్నులు మాత్రమే అప్పగించారు. ఇంకా 31,539.788 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది.

గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలి

లోకేశ్వరం: పంటలను గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని ఉమ్మడి రాష్ట్రాల ఎన్‌సీడీఈఎక్స్ మార్కెట్ మేనేజర్ శ్రీనివాస్‌రావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో లోకేశ్వరం మహిళా ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కొనుగోలుదారు సంస్థ ఎన్‌సీడీఈఎక్స్ ప్రతినిధులు పంట కొనుగోలు, మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. పంటలను ఎక్కువ ధరకు ఎలా అమ్ముకోవాలో వివరించారు. ఏపీ మాస్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజేశ్వర్, బీడీవో అనిల్, ఎఫ్‌పీవో సీఈవో మేఘన, సిబ్బంది గణేశ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

బంద్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకుడు

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16వ తేదీన తలపెట్టిన భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, ఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి కే రాజన్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ కోరారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారత్‌బంద్‌లో కార్మిక, కర్షక, మేధావి వర్గాలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసాచారి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు లలిత, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కెమెంట్ వేస్లీ, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి రామ్‌లక్ష్మణ్, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజేశ్, నాయకులు హరిత, ఎస్ఎన్ రెడ్డి, స్వదేశ్, గంగన్న, ఎండీ గఫూర్, పీవోడబ్ల్యూ నాయకులు లక్ష్మి, ఎస్.లక్ష్మి, ఏఐటీయూసీ నాయకురాలు పద్మకుమారి పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

లక్ష్మణచాంద: యూడైస్‌ప్లస్ వెరిఫికేషన్‌లో భాగంగా జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు రాజేశ్వర్, లింబాద్రి మంగళవారం మండలంలోని అక్షర ఉన్నత పాఠశాల, నర్సాపూర్ (డబ్ల్యూ)పాఠశాలలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల వివరాలు రిజిస్టర్ ప్రకారం ఉన్నాయా.. లేదా.. అని తెలుసుకున్నారు. వారి వెంట మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది హర్షద్, స్పందన్, సీఆర్పీలు మహేందర్, సుధాకర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న రాజేశ్వర్

క్లుప్తంగా

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి


భోజరాం(ఫైల్)

భైంసాటౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న భోజరాం (53) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. విధులు ముగించుకుని మధ్యాహ్నం పట్టణంలోని సంతోషిమాత నగర్‌లోని తన ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే గుండెపోటుతో కుప్పకూలింది. కుటుంబీకులు వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భోజరాం మృతిపై ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, సీఐ రాజారెడ్డి, ఎస్సైలు, స్టేషన్ సిబ్బంది సంతాపం తెలిపారు.

జాతీయ స్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో శిక్షకురాలు సునీత

గుడిహత్నూర్: మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లిలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చి పతకాలు సాధించారు. 8వ తరగతి చదువుతున్న కె.అనోకి బంగారు పతకం, 7వ తరగతి విద్యార్థి లోఖండే అంజలి వెండి పతకం, 10వ తరగతి విద్యార్థి ఎస్.రోష్నీ కాంస్య పతకం సాధించి అబ్బుర పరిచారు. వీరు కరాటే శిక్షకురాలు కదం సునీత నేతృత్వంలో శిక్షణ పొందుతున్నారు. పాఠశాల హెచ్ఎం రాచకొండ దేవిదాస్, పాఠశాల సిబ్బంది సోమవారం అభినందిస్తూ సన్మానించారు.

ఓవర్ టు మర్రిచెట్టు..

- పటేల్ కితకు ఘన స్వాగతం
- నేడు రాత్రి తూమ్ పూజలు


మర్రిచెట్టు నీడలో గుడారాలు ఏర్పాటు చేసుకుని బస చేస్తున్న మెస్రం వంశీయులు


కాగడా వెలిగిస్తున్న మెస్రం వెంకట్‌రావ్


పూజలు చేస్తున్న పటేల్ కిత వంశీయులు

ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో భాగంగా మెస్రం వంశీయులు సేకరించిన గంగాజలంతో సోమవారం రాత్రి కేస్లాపూర్ పొలిమేరకు చేరుకున్న విషయం తెలిసిందే. మర్రి చెట్టు వద్ద కితల వారీగా బస చేసి మంగళవారం విశ్రాంతి తీసుకున్నారు. రాత్రి నాగోబా మురాడి నుంచి సంప్రదాయ వాయిద్యాల మధ్య పటేల్ కిత వంశీయులను చెట్టు వద్దకు తీసుకొచ్చి అతిథి మర్యాదలు చేశారు. ప్రధాన్ సమాజ్ పెద్ద నాగోబా చరిత్ర బోధించారు. బుధవారం రాత్రి మెస్రం తూమ్(కర్మఖాండ)పూజలు నిర్వహించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ తెలిపారు. కార్యక్రమంలో వంశ పెద్దలు చిన్ను పటేల్, బాదిరావ్, కోసు, కోసేరావ్, హనుమంత్‌రావ్, దాదారావ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నాగోబా జాతర వైభవంగా నిర్వహించాలి

- అధికారులతో సమావేశమైన కలెక్టర్
- భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశం
- కిలో మీటర్‌లోపు మద్యం షాపులు బంద్ చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్


స్టాల్స్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: నాగోబా జాతరను వైభవంగా నిర్వహించాలని మంగళవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ముందుగా ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ప్రభుత్వ స్టాల్స్, ట్రైబజార్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జాతర ఏర్పాట్లు, చేపట్టాల్సిన పనుల వివరాలను శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగోబా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 9న రాత్రి మహాపూజతో జాతర ప్రారంభమవుతుందని, 12న నాగోబా దర్బార్ నిర్వహించనున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు 80శాతం పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వైద్య శిబిరాలతో పాటు 104, 108 అంబులెన్స్‌లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. జాతరలో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేస్లాపూర్ పరిసరా ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల వరకు మద్యం షాపులు నిర్వహించకుండా ఎక్సైజ్‌శాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. మర్రిచెట్టు ప్రాంతం, గోవడ్, దేవాలయ ప్రాంగణం సమీపంలో చేపట్టిన వివిధ పనులను వెంటనే పూర్తిచేయాలని అన్నారు.

భారీగా పోలీసు బందోబస్తు

నాగోబా జాతర నిర్వహణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్పీ గౌస్ ఆలాం అన్నారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నట్లు వివరించారు. బందోబస్తుకు సుమారు 600 మంది పోలీసులు విధులు నిర్వహిస్తారని తెలిపారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి..

నాగోబా జాతరలో మెస్రం వంశీయులకు, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి లోటులేకుండా ఏర్పాట్లు చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో జాతర ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పార్కింగ్, క్రీడల నిర్వహణ తదితర పనులను చేపట్టాలని అన్నారు. జాతరలో నకిలీ ఆహార పదార్థాలు విక్రయించకుండా తనిఖీలు చేపట్టాలన్నారు. శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డిప్యూటీసీ ఆర్క పుష్పలత, సర్పంచ్ మెస్రం రేణుకనాగ్‌నాథ్, ఈవో రాజమౌళి, మెస్రం వంశీయులు మెస్రం మనోహర్, నాగ్‌నాథ్, ఆనంద్‌రావ్ ఉన్నారు.

కష్టాలను ఎదురించి.. అనుకున్నది సాధించి

- పట్టుబట్టి కొలువు కొట్టిన వైనం
- స్టాఫ్‌నర్స్‌గా ఎంపికైన సుజాత


కొడుకు వర్షిత్‌తో సుజాత

నిర్మల్‌ఖిల్లా: కష్టాలకు ఎదురీదిన ఆ యువతి... కట్టుకున్న భర్త అర్ధాంతరంగా తనువు చాలించినా ఏడాది వయసున్న కొడుకుతో ఒంటరిగా శ్రమించింది. నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలం ఆలూరు గ్రామానికి చెందిన 'నక్క సుజాత' సర్సాపూర్-జి మండల కేంద్రానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. 2012లో కుమారుడు జన్మించాడు. అనుకోని రీతిలో తన భర్త 2013లో మరణించాడు. ఒంటరైన సుజాత తన ఏడాది వయసున్న కొడుకుతో జీవనగమనంలో అనేక సాధకబాధకాలను చవిచూసింది. అయినా ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. తన పెళ్లికి ముందు తాను చదివిన జీఎన్ఎం నర్సింగ్ ట్రైనింగ్ తనకు ఉపాధిని కల్పించింది. అవుట్ సోర్సింగ్‌లో తక్కువ వేతనానికే భైంసా, ఆదిలాబాద్, నిర్మల్ తదితర ప్రాంతాల్లో తాత్కాలిక నర్సుగా పనిచేస్తూనే ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నించింది. 2013 నుండి 2023 వరకు ఇదే అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగం కోసం సుదీర్ఘకాలంగా పట్టుదలతో శ్రమించింది. దాదాపు మూడు, నాలుగు సార్లు రెండు, మూడు మార్కులతోనే ఉద్యోగం చేజారిన నిరుత్సాహపడలేదు. ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలని లక్ష్యంతో చదివింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో తెలంగాణ వైద్యవిధాన పరిషత్‌లో స్టాఫ్ నర్స్ ఉద్యోగానికి ఎంపికై ంది. అనుకున్న లక్ష్యాన్ని చేరి పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇంద్రవెల్లి: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఏఐసీసీ ఎస్టీ విభాగం జాతీయ కోఆర్డినేటర్ కోట్నాక్ తిరుపతి అన్నారు. మంగళవారం స్థానిక అమరవీరుల స్తూపం వద్ద ఆదివాసీ సంఘాల నాయకులు, గ్రామ పటేల్‌తో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఇంద్రవెల్లిలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి పునర్నిర్మాణ సభకు వచ్చిన కాంగ్రెస్ నాయకులు కొందరు పాదరక్షలు ధరించి స్తూపం వద్ద ఫొటోలు దిగడంతో ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం శుద్ధిపూజ నిర్వహించడానికి అయ్యే ఖర్చులను కాంగ్రెస్ పార్టీ అందిస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో గత పది సంవత్సరాలుగా ఆదివాసీలను ఏనాడు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భారత్, మండల అధ్యక్షుడు జుగ్నాక్ భారత్, ఆదివాసీ సంఘాల నాయకులు చహకటి నాగోరావ్, మడావి ఇంద్రు, మెస్రం భారత్ ఉన్నారు.

'వ్యవస్థాపక' పోటీల్లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఐఐటీ బాంబే నిర్వహించిన వార్షిక ఈసమ్మిట్‌లో రాణించారు. ఫిబ్రవరి 2 నుంచి ముంబైలో ఈ కార్యక్రమం జరిగింది. టీన్‌జెనిత్ పేరిట మాస్టర్ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు రన్నరప్‌గా నిలిచి రూ.60వేల ప్రైజ్‌మనీని దక్కించుకున్నారు. దేశవ్యాప్తంగా 660 టీంలు పాల్గొనగా ఇందులో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు మొదటి రన్నరప్‌గా నిలిచారు. ఆరు నెలలుగా విద్యార్థులు పడిన శ్రమకు తగిన ఫలితం దక్కిందని వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ పేర్కొన్నారు. ఈసమ్మిట్ ఉత్సవాల్లో పాల్గొన్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్, పలువురు అధ్యాపకులు విద్యార్థుల బృందాన్ని అభినందించారు.

ప్లాస్టిక్ తిని లేగదూడ మృతి


లేగదూడకు చికిత్స అందిస్తున్న వైద్యులు

ఖానాపూర్: రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చేపట్టిన ప్లాస్టిక్ నిషేధం పట్టణ ప్రాంతాల్లో సక్రమంగా అమలు కాకపోవడంతో ప్లాస్టిక్ వినియోగదారులు ఎక్కడ పడితే అక్కడ వారు వినియోగించిన ప్లాస్టిక్ సంచులు పడేస్తున్నారు. ఈ ప్లాస్టిక్ సంచుల్లోని వ్యర్థపదార్థాలను మూగజీవాలు ప్లాస్టిక్‌తో సహా తినడంతో వాటికి కడుపులో ఉన్న ప్లాస్టిక్ జీర్ణం కాక తరచూ మృత్యువాత పడుతున్నాయి. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ లేగ దూడ కడుపు ఉబ్బి తీవ్ర అస్వస్థతకు గురై కిందపడిపోయింది. దీంతో అక్కడున్న ప్రయాణికులు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. వెటర్నరి ఏడీ రామచందర్, సిబ్బందితో అక్కడికి చేరుకొని స్థానికుల సహాయంతో దూడకు చికిత్స అందించారు. చికిత్స అందిన గంటన్నర తర్వాత లేగ దూడ బస్టాండ్ ఆవరణలో విలవిల కొట్టుకుంటూ మృతిచెందింది. కాగా ప్లాస్టిక్‌తో పాటు వ్యర్థాలు తిన్నకారణంగానే కడుపులో అది జీర్ణంకాకపోవడంతో పశువులు ఈ విధంగా మృత్యువాత పడుతున్నాయని ఆయన తెలిపారు. ప్లాస్టిక్ నిషేధాన్ని అరికట్టడంలో ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యమే మూగజీవాల మృత్యువాతకు కారణమని పలువురు పేర్కొంటున్నారు. పశువులను రోడ్ల మీద తిరుగనివ్వకుండా యజమానులకు సైతం నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వివేకానందుని బోధనలు ఎంతో అవసరం


ప్రశ్న పత్రాలు విడుదల చేస్తున్న మఠాధిపతి

ఆదిలాబాద్: నేటితరం విద్యార్థులకు వివేకానందుడి బోధనలు ఎంతో అవసరమని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ యోగానంద సరస్వతి స్వామి అన్నారు. స్వామి వివేకానంద రామకృష్ణ మఠాన్ని స్థాపించి 125 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో శ్రీ రామకృష్ణ సేవ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో భారత జాతికి నా హితవు అనే పుస్తకంపై మంగళవారం పోటీ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని తాంసి, తలమడుగు, ఆదిలాబాద్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. సమితి అధ్యక్షుడు ఆరే భూమన్న, ప్రధాన కార్యదర్శి కోరెడ్డి లెనిన్, జాయింట్ సెక్రటరీ లక్ష్మయ్య, సభ్యులు హనుమాన్లు శ్రీధర్, త్రివేణి, వర్షిని, పీఆర్టీయూ జనరల్ సెక్రటరీ రవీందర్, మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి విజేతలకు సత్కారం


క్రీడాకారులను సత్కరించిన కలెక్టర్, ఎస్పీ, ఇన్‌చార్జి పీవో

ఇంద్రవెల్లి: జాతీయ స్థాయి క్రీడల్లో పతకాలు సాధించిన గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల ఉట్నూర్‌కు చెందిన గిరిపుత్రులు ఆత్రం ఉదయ్‌కుమార్, ఆర్.విక్రమ్, మెస్రం నిఖిల్‌లను మంగళవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలాం శాలువాలు కప్పి సత్కరించారు. జార్ఖండ్ రాష్ట్రంలో రాంచిలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో తెలంగాణ జట్టు ద్వితీయ స్థానంలో ప్రతిభను సాధించడం సంతోషకరమైన విషయమని, ప్రతిభ కనబర్చడానికి కృషి చేసిన క్రీడా పాఠశాల క్రీడాకారులకు అభినందించారు.

దాడి కేసులో ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: దాడికి పాల్పడిన వ్యక్తికి ఏడాది పాటు జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్.సంపత్ మంగళవారం తీర్పునిచ్చినట్లు పట్టణ సీఐ ఎస్పీ రవీందర్ తెలిపారు. 2021 మే 13న జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన కమారపు సందీప్, అదేకాలనీకి చెందిన దేవుని శ్రీలతపై బండరాయితో దాడి చేశాడు. మహిళ సోదరుడు శనిగారపు రాజేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ఏడాది జైలుశిక్ష, జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... పార్‌పెల్లి గ్రామానికి చెందిన గంగాధర్ (55) సోమవారం చేనుకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఫైబర్ గ్రిడ్ కోసం తవ్విన గుంత పూడ్చలేదు. దీంతో రాత్రి సమయంలో అందులో పడిపోగా తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని మంగళవారం ఉదయం నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతడికి వెన్నుపూస విరిగిందని, సుమారు రూ.5లక్షల వరకు ఆపరేషన్ కోసం అవసరం అవుతాయని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీకి చెందిన డొండ్ల ఎల్లయ్యపై దాడికి పాల్పడిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ ఎస్సై ఎస్సై ప్రదీప్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం ప్రకారం... ఎల్లయ్యకు వంద వరకు పందులున్నాయి. మంగళవారం తన పందులు కన్పించడం లేదని మారుతి, లక్ష్మణ్‌లను ప్రశ్నించారు. దీంతో కోపోద్రిక్తులైన వారు ఎల్లయ్యపై కట్టెతో దాడికి పాల్పడ్డారు. అడ్డు వచ్చిన ఎల్లయ్య భార్య భూమక్కను సైతం దూషించారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు.

ఇరువురికి గాయాలు

తాంసి: మండలంలోని సావర్గాం గ్రామ సమీపంలో బైక్ ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... బెల్లూరి గ్రామానికి చెందిన దేవిదాస్ బైక్ నడుపుతూ సాయంత్రం కప్పర్ల గ్రామానికి వస్తున్నాడు. సావర్గాం వద్ద భూమన్న పంటచేను నుంచి ఇంటికి వస్తున్నాడు. దేవిదాస్ బైక్‌ను అజాగ్రత్తగా నడిపి భూమన్నను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో భూమన్నతో పాటు దేవిదాస్‌కు సైతం గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన ఇరువురిని ఆస్పత్రికి తరలించారు.

ఢిల్లీ, ముంబాయికి మన క్యాప్సికం...





ఆదిలాబాద్ పట్టణం మావల గ్రామానికి చెందిన అన్నదమ్ములు బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి అందరూ రైతుల్లా సంప్రదాయ పంటలను సాగు చేయకుండా వాణిజ్యపంటలపై దృష్టి సారించారు. తమకున్న 25ఎకరాల్లో వివిధ రకాల వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. ప్రధానంగా 9 ఎకరాల్లో రూ.5.50 కోట్ల వ్యయంతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పాలిహౌస్‌ను నిర్మించి అందులో క్యాప్సికం సాగు చేస్తున్నారు. రోజుకు ఒకటిన్నర టన్నుల క్యాప్సికం ఉత్పత్తి అవుతుండగా ఆ పంటను ట్రెయిన్ ద్వారా ఢిల్లీ, ముంబాయి నగరాలకు ఎగుమతి చేస్తు లాభాలు గడిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎరుపు, పసుపు వర్ణాల తో కూడిన క్యాప్సికం ఎగుమతి అవుతుండటం ఆదిలాబాద్ జిల్లా నుంచే కావడం గమనార్హం.

–సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్